క్లుప్తంగా

అక్రమ మద్యం బాటిళ్లు స్వాధీనం



మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు

వల్లూరు : మండల పరిధిలోని సీ కొత్తపల్లెలో ఆదివారం అక్రమ మద్యాన్ని విక్రయిస్తున్న ఒక వ్యక్తి వద్దనుంచి 51 అక్రమ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని అతనిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ వెంకటరమణ తెలిపారు. అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ దాడుల్లో ఏఎస్ఐ మోహన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గంధం పూజ

లింగాల : మండలంలోని పార్నపల్లెలో వెలసిన మక్కా ముస్కిన్‌వలి దర్గాలో ఆదివారం ఉరుసు కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. మొదటిరోజు గంధం పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. భారీగా తరలివచ్చిన భక్తులు మక్కా ముస్కిన్‌వలి జీవసమాధి వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని వై.కోడూరు గ్రామంలో సోమవారం సాయంత్రం నిర్వహించే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి పాల్గొంటారని ఉప మండలాధ్యక్షుడు మల్లు వెంకట మోహన్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

గ్రామాలలో శాంతిని నెలకొల్పాలి



గ్రామస్తులతో మాట్లాడుతున్న పట్టణ సీఐ ఈశ్వరయ్య

ఎర్రగుంట్ల : స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలలో శాంతిని నెలకోల్పడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పట్టణ సీఐ ఈశ్వరయ్య తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మండల పరిధిలోని వై.కోడూరు గ్రామంలో పల్లె నిద్ర కార్యాక్రమాన్ని ఆయన నిర్వహించారు. గ్రామంలోని ఇరు వర్గాల వారిని పిలిపించి కౌన్సిలింగ్ అందించారు. గ్రామంలోని మహిళలతో మాట్లాడి గ్రామంలోని ప్రధాన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలింగ్ బూత్‌లను పరిశీలించి అక్కడి మౌలిక సదుపాయాలు పరిశీలించారు. ఎస్ఐ చిరంజీ పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న శిల్పారామం సిబ్బంది

పులివెందుల రూరల్ / టౌన్ : శిల్పారామంలో పనిచేస్తున్న హౌస్‌కీపింగ్, సెక్యూరిటీ గార్డులకు వేతనాలు పెంచడంతో శిల్పారామం ఏఓ సుధాకర్ ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023లో శిల్పారామం ప్రారంభోత్సవానికి వచ్చిన ముఖ్యమంత్రికి వేతనాలు పెంచాలని సిబ్బంది వినతిపత్రం సమర్పించారు. దీనికి ఆయన స్పందించి 2024 ఫిబ్రవరి నెలలో మాకు వేతనాలు పెంచినందుకు ముఖ్యమంత్రికి రుణపడి ఉంటామని కృతజ్ఞతలు తెలియజేశారు.

పల్స్ పోలియో కేంద్రాల పరిశీలన



కేంద్రాలను పరిశీలిస్తున్న రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ అనిల్‌కుమార్

ఎర్రగుంట్ల : పల్స్ పోలియో కార్యక్రమం సందర్భంగా ఎర్రగుంట్ల, చిలంకూరు పీహెచ్‌సీ పరిధిలోని పల్స్ పోలియో కేంద్రాలను రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ అనిల్‌కుమార్ ఆదివారం పరిశీలించి మాట్లాడారు. పోలియో చుక్కలు వేయించుకోవడం వల్ల చిన్నారులకు పోలియో రాకుండా నివారించవచ్చన్నారు. ఎర్రగుంట్ల పరిధిలో 5342 మంది గాను 4988 మందికి పోలియో చుక్కలు వేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి మనోరమ, వైద్యులు జోత్స్నన, శ్రీనాథ్‌రెడ్డి, ప్రియాంక, చిలంకూరు పీహెచ్‌సీ వైద్యులు సాయిచరితరెడ్డి, సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం

పులివెందుల రూరల్/టౌన్ : పోలియో రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని, నిండు జీవితానికి రెండు చుక్కలు ఎంతో అవసరమని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, సివిల్ సప్లై డైరెక్టర్ హాల్ గంగాధరరెడ్డిలు తెలిపారు. పట్టణంలోని అంబకపల్లె రోడ్డులో ఉన్న వైఎస్సార్ మెమోరియల్ పాఠశాలలోని చిన్నారులకు వారు పోలియో చుక్కలు వేసి మాట్లాడారు. ఒకప్పుడు పోలియో అనేది అత్యంత ప్రమాదకరమైన వ్యాధి అని, పోలియో వైరస్ సోకిన వ్యక్తులు శరీర అవయవాలు పక్షవాతానికి గురై కాళ్లు, చేతులు పనిచేయక జీవచ్ఛవంలా జీవించేవారన్నారు. ప్రస్తుత కంప్యూటర్ కాలంలో వైద్య ఆరోగ్య సాంకేతిక సదుపాయాలు పెరగడంతో పోలియో కేసులు తక్కువగా నమోదవుతున్నాయన్నారు. అలాగే వికలాంగుల నెట్‌వర్క్ కార్యాలయంలో వికలాంగుల నెట్‌వర్క్ అధ్యక్షుడు రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. పులివెందులలో అంగన్‌వాడీ కేంద్రాలు, ఆర్టీసీ బస్టాండు, మండల పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. కౌన్సిలర్ భార్గవి, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

కమలాపురంలో..

కమలాపురం : పోలియో రహిత సమాజంగా తీర్చిదిద్దడంలో భాగంగా మండలంలోని పెద్దచెప్పలి పీహెచ్‌సీ పరిధిలో ఆదివారం జరిగిన పల్స్ పోలియో 97 శాతం పూర్తి అయిందని పీహెచ్‌సీ వైద్యాధికారిణి జ్ఞాన ప్రసూన తెలిపారు. ఉదయం 7 గంటలకే అన్ని సెంటర్లలో సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీ తదితర ప్రజా ప్రతినిధుల చేతుల మీదుగా చిన్నారులకు పోలియో చుక్కలు వేయించారు. మొత్తం 4 రూట్‌లలో ఉన్న 40 బూత్‌లలో 3810 మంది చిన్నారులకు గాను 3719 మందికి పోలియో చుక్కలు వేసినట్లు ఆమె తెలిపారు. సోమ, మంగళ వారాల్లో ఇంటింటికి తిరిగి పోలియో చుక్కలు వేసుకోని వారిని గుర్తించి పోలియో చుక్కలు వేస్తామన్నారు. అంగన్‌వాడీ, ఆశా, వైద్య ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



పులివెందులలో పోలియో చుక్కలు వేస్తున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్



వేమలలో చిన్నారికి చుక్కలను వేస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఉషారాణి

చెన్నూరులో..

చెన్నూరు : మండల వ్యాప్తంగా 4290 మంది చిన్నారులకు గాను 4160 మంది చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేసినట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ చెన్నారెడ్డి, ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్‌లు తెలిపారు. పల్స్ పోలియో చుక్కల మందును వేసేందుకు 45 బూత్‌లు, నాలుగు రూట్లను ఏర్పాటు చేశామన్నారు. అనంతరం ఐదేళ్ల లోపు చిన్నారులకు చుక్కల మందును వేశారు. డాక్టర్ వంశీకృష్ణ, ప్రదీప్‌కుమార్‌రెడ్డి, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నెలో..

చింతకొమ్మదిన్నె : స్థానిక పీహెచ్‌సీ పరిధిలో ఐదు సంవత్సరాలలోపు చిన్నారులకు ఆదివారం పోలియో చుక్కలు వేశారు. డాక్టర్ రాఘవేంద్ర, డాక్టర్ సునీత, ఆరోగ్య సిబ్బంది, సామాజిక కార్యకర్తలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మండల వ్యాప్తంగా 7350 మందికి గాను 7180 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. మిగిలిన వారికి సోమ, మంగళ వారాల్లో ఇంటింటికి వెళ్లి చుక్కలు మందు వేస్తామని వైద్యాధికారులు తెలిపారు.

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : మండలంలో 22 పంచాయతీల్లో 39 కేంద్రాలు, మొబైల్ బృందం ద్వారా 3497 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్లు మండల వైద్యాధికారి మహ్మద్ తెలిపారు. సోమవారం, మంగళవారం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ప్రతి ఇంటికి వెళ్లి పోలియో చుక్కలు వేయించుకోకుండా ఉన్న వారిని గుర్తించి వారికి చుక్కలు వేస్తామన్నారు.

వేములలో..

వేముల : మండలంలోని వేముల, వేల్పులలో పల్స్ పోలియో కార్యక్రమాలను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ లింగాల ఉషారాణి, ఎంపీపీ చల్లా గంగాదేవిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 0 నుంచి 5 సంవత్సరాలలోపు చిన్నారులకు అంగవైకల్యానికి గురికాకుండా పల్స్ పోలియో చుక్కలు వేయించాలన్నారు. మండల వ్యాప్తంగా ప్రతి గ్రామంలో ఏర్పాటు చేసిన బూత్‌లకు వెళ్లి తమ చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేయించాలన్నారు. మండల వ్యాప్తంగా 3233 మంది చిన్నారులు ఉండగా 3135 మందికి పోలియో చుక్కలు వేసినట్లు వైద్యాధికారిణి శరణ్యారెడ్డి తెలిపారు. 4, 5 తేదీలలో ఇంటింటికి వెళ్లి ప్రతి చిన్నారికి పల్స్ పోలియో చుక్కలు వేయించడం జరుగుతుందన్నారు.

లింగాలలో..

లింగాల : మండలంలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతంగా సాగిందని పీహెచ్‌సీ డాక్టర్ సుభాషిణి తెలిపారు. మండల వ్యాప్తంగా 3599 మంది ఉండగా 3804 మంది చిన్నారులకు మొదటి రోజు పల్స్ పోలియో చుక్కలు వేశామన్నారు. సుమారు 98 శాతం పల్స్ పోలియో విజయవంతమైందన్నారు. మిగిలిన చిన్నారులకు సోమ, మంగళ వారాల్లో ఇంటింటా తిరిగి పల్స్ పోలియో చుక్కలను వేస్తామన్నారు. మండల కేంద్రంలో పల్స్‌పోలియో కేంద్రాన్ని ప్రపంచ ఆరోగ్య సంస్థ అధికారిణి డాక్టర్ హర్షిత సందర్శించి చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలను వేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు, వలంటీర్లు చురుగ్గా పాల్గొని పల్స్ పోలియోను విజయవంతం చేశారన్నారు.

వేంపల్లెలో..

వేంపల్లె : మండల వ్యాప్తంగా ఆదివారం ఏర్పాటు చేసిన 51 కేంద్రాల్లో పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతమైందని ఎంపీడీఓ దివిజ సంపతి తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో జడ్పీటీసీ ఎం.రవికుమార్‌రెడ్డి, కన్వీనర్ చంద్రఓబుల్‌రెడ్డిలు చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేశారు. అలిరెడ్డిపల్లి గ్రామ సచివాలయంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ రామకృష్ణారెడ్డి, ఎంపీపీ లక్ష్మిగాయత్రి, వైస్ ఎంపీపీ బాబాషరీఫ్ చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో వైద్యురాలు డాక్టర్ స్వాతిసాయి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు రూరల్ : 5 సంవత్సరాలు నిండిన ప్రతి చిన్నారులకు రెండు పోలియో చుక్కలు వేయించి పోలియో రహిత సమాజాన్ని నిర్మించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఆమె చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో డాక్టర్లు, ఎఎన్‌ఎంలు పాల్గొన్నారు.



జమ్మలమడుగులో చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ



వేంపల్లెలో పల్స్‌పోలియో చుక్కలు వేస్తున్న కన్వీనర్ చంద్రఓబుల్‌రెడ్డి



లింగాలలో పల్స్ పోలియో చుక్కలు వేస్తున్న ప్రపంచ ఆరోగ్య సంస్థ అధికారిణి డాక్టర్ హర్షిత



వీఎన్‌పల్లె : గంగిరెడ్డిపల్లెలో వ్యాక్సిన్ పరిశీలిస్తున్న మండల వైద్యాధికారి



సీకేదిన్నెలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న డాక్టర్ రాఘవేంద్ర



చెన్నూరులో పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్



కమలాపురంలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ జ్ఞాన ప్రసూన

అవయవ దానం మరొకరికి ప్రాణదానం

చక్రాయపేట : అవయవ దానం వల్ల అనారోగ్యంతో ఉన్న మరొకరికి వాటిని అమరిస్తే వారు ఆరోగ్యంగా ఉంటారని ఆర్కేవ్యాలీ ట్రిపుల్‌ఐటీ ఎన్ఎస్ఎస్–9 యూనిట్ అధికారి బొజ్జా అనిల్ కుమార్‌రెడ్డి తెలిపారు. ట్రిపుల్‌ఐటీ ఎన్ఎస్ఎస్, పులివెందుల స్నేహిత అమృత హస్తం సేవాసమితి ఆధ్వర్యంలో మండలంలోని మారెళ్లమడకలో నేత్ర దానం, అవయవ దానం, రక్తదానంపై ప్రజలకు అవగాహణ కల్పించారు. స్నేహిత అమృత హస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ అవయవ దానంతో మరణించిన వారు మళ్లీ జీవించినట్లేనన్నారు. 18 నుంచి 60 సంవత్సరాల లోపు వయసు ఉండి 45 కిలోల బరువు ఉన్న వారు ప్రతి 3 నెలలకు ఒక సారి రక్త దానం చేయవచ్చునన్నారు. కార్యక్రమంలో సర్పంచు నరసింహులు, నేత్ర సేకరణ కేంద్రం టెక్నీషి ఎస్.హరీష్, విద్యార్థులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 85 మంది విద్యార్థినీ విద్యార్థులు అవయవ దానం చేసేందుకు సమ్మతించి సంబంధిత పత్రాలపై సంతకాలు చేశారని అధికారి అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

జగనన్న ప్రభుత్వంలో బీసీలకు పెద్ద పీట

జమ్మలమడుగు రూరల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో బీసీలకు పెద్ద పీట వేశారని కడప పార్లమెంట్ అధ్యక్షుడు సురేష్‌బాబు అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎస్వీ ఫంక్షన్‌హాల్‌లో ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన యాదవ్‌ల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో ఆయన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డితోకలసి పాల్గొని మాట్లాడారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలోకన్నా బీసీలకు జగనన్న ప్రభుత్వంలో న్యాయం జరిగిందని ఆయన తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ దేవగుడి కుటుంబీకులు నియోజకవర్గంలో తిరిగి ఫ్యాక్షన్ ను ప్రొత్సహిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ మూలే సుధీర్‌రెడ్డి తెలిపారు. దేవగుడి కుటుంబీకులు వచ్చే ఎన్నికల్లో ఎలాగైన గెలవాలని ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో చిచ్చుపెడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డి మీడియా ముందు వచ్చి ప్రగల్బాలు పలికి వెళ్లడమే తప్ప ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేయాలనే ఆలోచన లేదన్నారు. అనంతరం ఎమ్మెల్సీలు పి.రామసుబ్బారెడ్డి, రమేష్ యాదవ్‌లు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు తన ప్రభుత్వంలో బీసీలను మోసం చేశాడన్నారు. బీసీలకు సామాజిక న్యాయం జరిగిందంటే ఒక్క జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలోనే అన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండి మరో సారి ముఖ్యమంత్రిగా చేసుకోవలసిన అవసరం ఎంతైన ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర హార్టికల్చర్ సలహాదారుడు సంబటూర్ ప్రసాద్‌రెడ్డి, జడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, కొప్పల శివయాదవ్, బంగారు నాగయ్య యాదవ్, హృషికేశవరెడ్డి, డాక్టర్ అగస్టీన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ

చింతకొమ్మదిన్నె : మండలంలోని రోడ్డుకృష్ణాపురం రైల్వేస్టేషన్, తాడిగొట్ల గ్రామాలకు వెళ్లే మార్గాలకు సీసీ రోడ్డు పనులకు ఆదివారం కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి భూమిపూజ చేసి ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమలాపురం నియోజకవర్గం జిల్లాలోని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దాలని సంకల్పంతో ప్రతి గ్రామానికి సీసీ రోడ్లు, తారు రోడ్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు గజ్జల సుధాకర్‌రెడ్డి, కన్వీనర్ గూడా ప్రభాకర్‌రెడ్డి, కో కన్వీనర్ కళా యాదవ్, మాజీ కన్వీనర్ గుత్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఎంపీటీసీ ప్రసాద్‌రెడ్డి, నాయకులు ఓబుల్ రెడ్డి, విశ్వనాథరెడ్డి, నాగ మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

జగనన్నతోనే మరిన్ని సంక్షేమ పథకాలు



సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరిస్తున్న జడ్పీటీసీ శివప్రసాదరెడ్డి

చక్రాయపేట : మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిగా చెసుకుంటే మరిన్ని సంక్షేమ పథకాలు వస్తాయని చక్రాయపేట జడ్పీటీసీ సభ్యుడు శివప్రసాదరెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని కుప్పం, దళితవాడ, నడిమిపల్లెల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మండల సమన్వయకర్త ఓబుళరెడ్డితో కలసి నిర్వహించారు. ప్రతి ఇంటి వద్దకు వెళ్లి జగనన్న ప్రభుత్వంలో వచ్చిన సంక్షేమ పథకాలు వాటి వల్ల ఆఇంటికి కలిగిన లబ్ధిని వివరించారు. పార్టీ నేతలు దేవానందరెడ్డి, కృష్ణారెడ్డి, శివారెడ్డి, మోహన్‌రెడ్డి, గంగయ్య, రెడ్డెప్పరెడ్డి, రామమోహన్‌రెడ్డి, చెన్నకృష్ణారెడ్డి, శివశంకర్‌రెడ్డి, తిరుపతయ్య, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీ పోలేరమ్మ ఆలయానికి వితరణ

కడప రూరల్ : కడప నగరం బిల్టప్ వద్ద శ్రీ పోలేరమ్మ ఆలయ తిరునాల సందర్భంగా ఆదివారం భక్తురాలు కాంతమ్మ రూ.50 వేలు అందజేసింది. ఈ సందర్భంగా జిల్లా బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గోవిందు నాగరాజు మాట్లాడుతూ కూలీ పనులు చేసుకొని జీవనం సాగించే కాంతమ్మ.. ఆలయానికి రూ.50 వేలు అందజేయడం అభినందనీయమన్నారు. కాగా తిరునాల మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా రక్తదానం శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బాలస్వామిరెడ్డి, ఆలయ ధర్మకర్త సుబ్బారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పులివెందుల రూరల్ : మండలంలోని నల్లపురెడ్డిపల్లె 33/11 కేవీ, కొత్తపల్లె 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో సోమవారం ఉదయం 7 గంటల నుంచి 12 గంటల వరకు మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ మురళీకృష్ణ తెలిపారు. పట్టణంలోని పార్నపల్లె రోడ్డు ఫీడర్, ఉలిమెల్ల రోడ్డు ఫీడర్‌లో చెట్లు కటింగ్ ఉన్న సందర్భంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. అలాగే 11కేవీ ఫీడర్‌లో మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని వారు కోరారు.

గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో గంగమ్మతల్లి

చింతకొమ్మదిన్నె : మండలంలోని బుగ్గలేటిపల్లి–కొత్తపేట సరిహద్దుల్లో వెలసిన గంగమ్మతల్లి ఆలయంలో ఆదివారం అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని పట్టు వస్త్రాలతో అలంకరించారు. కోరికలు తీరిన భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో విందు భోజనాలను ఆరగించారు. సాయిబాబా, వైద్యనాథీశ్వరుడు, అక్కదేవతలు, నవగ్రహాలు, వీరభద్రుడు, ఆంజనేయస్వామిలకు పూజలు నిర్వహించారు.

ఘనంగా కాలభైరవస్వామి మాసోత్సవం

కడప కల్చరల్ : కడప నగర సమీపంలోని మగ్దూమ్ సాహెబ్ కొట్టాల గ్రామంలో గల శ్రీ ఇష్టక్యామర్థ కాలభైరవస్వామి మందిరంలో ఆదివారం కాలాష్టమి సందర్భంగా మాసోత్సవ పూజలను నిర్వహించారు. బాసట స్వచ్ఛంద సేవా సంస్థ దత్తత తీసుకున్న ఈ గ్రామంలో అత్యంత పురాతనమైన కాలభైరవస్వామి పూజల్లో విశేషమైనదిగా భావించే కుష్మాండ పూజల్లో పాల్గొనేందుకు పలువురు భక్తులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు గుమ్మడికాయను స్వామికి సమర్పించి అనంతరం వాటిపై దీపాలను వెలిగించి హారతులు ఇచ్చారు. అర్చకులు కాలభైరవ స్తోత్రం, అష్టోతర శతనామావళి పఠింపజేశారు. ఆలయ మూల విరాట్ మూర్తికి భక్తులు స్వయంగా కుంకుమార్చన చేసే అవకాశం కల్పించారు. పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు ఆలయ ప్రాంగణంలోని సప్తమాతృకల విగ్రహాల శిలకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కుకున్నారు. పెద్ద సంఖ్యలో ఆలయ విశేష పూజల్లో ఒకటైన కుష్మాండ పూజలో భాగంగా గుమ్మడికాయలపై హారతులు ఇచ్చారు.

నేడు ఇళ్ల పట్టాలు పంపిణీ

ఎర్రగుంట్ల : మున్సిపల్ పరిధిలో మంజూరైన ఇళ్లకు సంబంధించి రిజిస్ట్రేషన్ పత్రాలను సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేయనున్నట్లు కమిషనర్ రామకృష్ణయ్య అదివారం ఒక ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులు ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంకు చేరుకోవాలన్నారు. కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు కూడా పాల్గొనాలని ఆయన కోరారు.

చెన్నూరు నేతలను కలిసిన ఎంపీ



వైఎస్ఆర్‌సీపీ సీనియర్ నేతతో మాట్లాడుతున్న ఎంపీ, డిప్యూటీ సీఎం, వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే

వల్లూరు : చెన్నూరుకు చెందిన పలువురు సీనియర్ వైఎస్ఆర్‌సీపీ నేతలను ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, డిప్యూటీ సీఎం ఎస్బీ అంజాద్‌బాషా, పార్టీ జిల్లా అధ్యక్షుడు సురేష్‌బాబు, ఎమ్మెల్యే పీ రవీంద్రనాథరెడ్డిలు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. మొదట పార్టీ ముఖ్య సీనియర్ నేత ముదిరెడ్డి శివరామిరెడ్డిని, ఆయన కుటుంబ సభ్యులను వారి గృహంలో కలిశారు. మండలంలో రాజకీయ పరిస్థితులపై చర్చించారు. మండలంలో పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలను గురించి చర్చించారు. పార్టీ అభ్యర్థుల విజయానికి పూర్తిస్థాయిలో కృషి చేయాలని కోరారు. అనంతరం మాజీ డీసీఎంఎస్ చైర్మన్ పెడబల్లె ప్రతాప్ రెడ్డి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ గణేష్‌రెడ్డి, సీనియర్ నేత పెడబల్లె జయభారత్‌రెడ్డిలను వారి గృహాల్లో కలిశారు. రాబోవు ఎన్నికల్లో పార్టీకి మద్దతు ఇచ్చి పార్టీ అభ్యర్థుల విజయానికి పూర్తిస్థాయిలో కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నేత మాసీమబాబు, దిలీప్‌రెడ్డి, దినేష్‌రెడ్డి, సుబ్బారెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సతీష్‌రెడ్డిని కలిసిన వైఎస్సార్‌సీపీ నాయకులు

వేంపల్లె : ఎస్.వి.సతీష్‌కుమార్‌రెడ్డి మూడు దశాబ్దాలుగా తెలుగుదేశం పార్టీలో ఉంటూ 2019లో ఆ పార్టీకి రాజీనామా చేశాడు. నాలుగు ఏళ్లుగా తటస్థంగా ఉన్న ఆయన ఇటీవల తాడేపల్లిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీ కండువా కప్పుకున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఆయన స్వగృహమైన వేంపల్లెకు రావడంతో వైఎస్సార్‌సీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. అందులో మండల కన్వీనర్ చంద్రఓబుల్‌రెడ్డి, షాదీఖానా కమిటీ చైర్మన్ షేక్షావలి, సొసైటీ మాజీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు రవిశంకర్‌గౌడ్, మార్కెట్‌యార్డు డైరెక్టర్ రామకృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ సురేష్, ఎంపీటీసీ ప్రదీప్‌కుమార్‌రెడ్డి, వార్డు మెంబర్లు, తదితరులు కలిసి సతీష్‌రెడ్డిని పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా సతీష్‌రెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో ఎంతో కష్టపడి పనిచేసినా ఫలితం లేదన్నారు. ఆ పార్టీలో ఎన్నో రాజకీయ పోరాటాలు చేసినా చెప్పుడు మాటలు విని చమత్కారాలు, అవమానాలు తప్ప ఒరిగిందేమీ లేదన్నారు. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలన్న ధృడ సంకల్పంతో వైయస్సార్‌సీపీలో చేరడం చాలా సంతోషంగా ఉందన్నారు.



సతీష్‌రెడ్డిని కలిసిన వైఎస్సార్సీపీ నాయకులు

ఘనంగా అవధూత ఆవులస్వామికి పూజలు

లింగాల : మండలంలోని అంబకపల్లెలో వెలసిన అవధూత శ్రీ ఆవులస్వామి ఆరాధనోత్సవం ఆదివారం ఆలయ కమిటీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి స్వామి వారికి ఆభరణాలు, పట్టువస్త్రాలను అందించి ప్రారంభించారు. మండల వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి వైఎస్ అభిషేక్‌రెడ్డి ఆవులస్వామిని దర్శించుకున్నారు. వందలాది భక్తులు ఆవులస్వామి దర్శించుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం చిన్నారులు నిర్వహించిన చెక్కభజనలు, తాళాల భజన కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. భక్తులు రాత్రి జాగారం చేసేందుకు నాటక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి వ్యక్తిగత కార్యదర్శి రాఘవరెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు స్వామి వారిని దర్శించుకున్నారు. అలాగే మండలంలోని ఇప్పట్ల గ్రామంలో వెలసిన ఆవులస్వామి ఆలయంలో గ్రామ ప్రజలు, భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.



ఆవులస్వామిని దర్శించుకున్న మండల వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి వైఎస్ అభిషేక్‌రెడ్డి